RNI NO: APTEL/26/A5325

మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 81 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజిలు : 4 వెల రూ. 2 మంగళవారం -08 - సెప్టెంబర్ - 2026

Published From : Chittoor circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

2లో

ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

విపక్షం గెలిస్తే రాహుల్‌కు ప్రధాని పదవిపై హక్కు ఉంటుంది: సీపీఎం నేత ఎంఏ బేబీ

2లో

- ప్రతిపక్ష నాయకుడిగా ఆయనకు ఆ హక్కు సహజంగా ఉంటుందన్న సీపీఎం నేత
- ప్రధాని ఎవరనేది ఎన్నికల తర్వాతే పార్టీలు నిర్ణయిస్తాయని స్పష్టీకరణ
- బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమన్న బేబీ

2లో

నాయకులు అహంకారానికి దూరంగా ఉండాలి ఎంపీ రామ్మోహన్ నాయుడు

- నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్న రామ్మోహన్
- అభ్యర్థి ప్రవర్తన ఎన్నికల్లో 68.9% ప్రభావం చూపుతుందని వెల్లడి
- ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచన
- ఎంత ఎదిగినా అహంకారం దగ్గరకు రానీయవద్దని హితవు

పన్నులు వసూలు చేయడం

పవన్‌కు తెలుసు

పేపర్ మిల్లు వ్యవహారంపై స్పందించిన ఎంపీ పురందేశ్వరి

2లో

- పన్ను బకాయిలు మంత్రి పవన్ వసూలు చేస్తారన్న విశ్వాసం
- యాజమాన్యాలకు సామాజిక బాధ్యత ఉండాలని హితవు
- నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టీకరణ
- స్థానిక ఎన్నికల్లో కూటమి సమన్వయంతో ముందుకెళ్తుందని వెల్లడి

వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం..

ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి: రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం మిగతా 2 లో



2లో

అమరావతిపై నాకు అభ్యంతరం లేదు.. మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి

- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి

మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం..

డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు

- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైళ్లను, కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య



తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, మిగతా 2 లో

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా

కేసీఆర్ భారీ ఉద్యమం

ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

- అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్.. భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి
- అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మిగతా 2 లో

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

- అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్
- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం
- స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. మిగతా 2 లో

గ్రామ నిధులు నేరుగా సర్పంచ్‌లకే

ఇచ్చేలా కొత్త బిల్లు ప్రవేశపెడుతున్నాం

సర్పంచ్‌లకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్.. త్వరలో కొత్త బిల్లు!

- ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ విధానంలో మార్పులు
- ఒత్తిళ్లను తట్టుకుని దృఢంగా ఉండాలని సర్పంచ్‌లకు సూచన

హైదరాబాద్ : తెలంగాణలోని సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీపికబురు అందించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన నిధులు నేరుగా సర్పంచులకే మిగతా 2 లో

2లో

తెలంగాణలో మళ్లీ వర్షాలు..

20 జిల్లాలకు అలర్ట్ జారీ

- తెలంగాణలో మళ్లీ ప్రారంభమైన వర్షాలు
- రాష్ట్రంలోని 20 జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక
- హైదరాబాద్ సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

తెలంగాణలో మళ్లీ వర్షాలు..20 జిల్లాలకు అలర్ట్ జారీ

హైదరాబాద్ : తెలంగాణలో వర్షాలు మళ్లీ పుంజుకున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన చేస్తూ.. రాజధాని సహా ఆరు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్', మరో 14 జిల్లాలకు 'యెల్లో అలర్ట్' జారీ చేసింది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడ్చల్, నల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతోంది.

సర్పంచ్‌లకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్.. త్వరలో కొత్త బిల్లు!

హైదరాబాద్ : తెలంగాణలోని సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీపికబురు అందించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలోనే అసెంబ్లీలో నూతన బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ మార్పు ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆమె హామీ ఇచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఉప సర్పంచులకు చెక్ పవర్ కల్పిస్తూ తీసుకువచ్చిన చట్టం వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, నిధుల విషయంలో ఎదురవుతున్న అవరోధాల వల్ల అభివృద్ధి పనులు ఆగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులను ఉద్దేశించి మంత్రి పలు సూచనలు చేశారు. నాయకులుగా విమర్శలను, ఒత్తిళ్లను తట్టుకుని మానసికంగా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కేవలం మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించడంపై కూడా దృష్టి సారించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది రకాల ఆదర్శ గ్రామ సూత్రాలను పాటించి, గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని ఆమె సూచించారు.

పన్నులు వసూలు చేయడం పవన్‌కు తెలుసు
పేపర్ మిల్లుపై పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు

అమరావతి: రాజమహేంద్రవరం పేపర్ మిల్లు వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. పారిశ్రామికాభివృద్ధి రాష్ట్ర పురోగతికి అవసరమే అయినప్పటికీ, యాజమాన్యాలు సామాజిక బాధ్యతను విస్మరించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పేపర్ మిల్లు యాజమాన్యం కాలుష్య నివారణ చర్యలను గాలికి వదిలేసిందని పురందేశ్వరి విమర్శించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసిన తర్వాత నిబంధనలను ఉల్లంఘిస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పేపర్ మిల్లు నుంచి రావాల్సిన పన్ను బకాయిలు, జరిమానాలను ఏ విధంగా రాబట్టాలో సంబంధిత మంత్రి పవన్ కల్యాణ్‌కు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని ఆమె పేర్కొన్నారు. ఇదే క్రమంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణను కూడా ఆమె వివరించారు. మంగళవారం రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని వంద ప్రాంతాల్లో ఏకకాలంలో పార్టీ పతాకాలను ఆవిష్కరిస్తామని, అనంతరం కంబాలచెరువు వద్ద భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజైన సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు పూర్తి సమన్వయంతో ముందుకు సాగుతాయని పురందేశ్వరి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే మూడు పార్టీల నేతలతో చర్చించారని ఆమె గుర్తుచేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారన్న ప్రచారంపై స్పందిస్తూ.. 'కేటాయిస్తే మంచిదే కదా' అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ ప్రాతపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

భవిష్యత్ లక్ష్యాలు ఇవే..

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..
కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద నోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. అందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం

కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు. "ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం..ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కానెక్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, నట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

నాయకులు అహంకారానికి దూరంగా ఉండాలి

అమరావతి: టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో కేంద్ర మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగం చేశారు. నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ పటిష్ఠంగా ఉంటుందని, ప్రజా జీవితంలో ఉన్నవారు తమ ప్రవర్తన విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అభ్యర్థి ప్రవర్తన 68.9 శాతం వరకు గెలుపోటములను ప్రభావితం చేస్తుందని పలు సర్వేలు చెబుతున్నాయని రామ్మోహన్ నాయుడు గుర్తుచేశారు. ఉత్తమ పనితీరుతో నాయకత్వాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చూసి నేర్చుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు నిరంతరం ఓటర్లు, పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని, ముఖ్యంగా జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా మన కార్యాచరణ ఉండాలని పిలుపునిచ్చారు. కేవలం సమస్యలను గుర్తించడమే కాకుండా, వాటిని వేగంగా పరిష్కరించే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రజల సమస్యలను ఓపికగా వినే సహనం నాయకులకు చాలా అవసరమని అన్నారు. నాయకుడిగా ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా అహంకారాన్ని దరిచేరనీయవద్దని రామ్మోహన్ నాయుడు హితవు పలికారు. ప్రవర్తనే నాయకుడికి అసలైన కొలమానమని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.

అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..
మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి

అమరావతి: "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? అయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ ఠాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం..
డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమ

పీజీఆర్ఎస్ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 7 : ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని... "ఎల్‌నినో" వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు, సాగు విధానాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధి మీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో జిలా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరి...

ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాన్ని సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ అధికారులు

న్యాయ విజ్ఞాన సదస్సులో బాలలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన

కడప జిల్లా/కడప, సెప్టెంబర్ 7 (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని పరిసరాలు, బాలల జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వంటశాల, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించి బాలలకు అందుతున్న భోజన సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో విద్య ఎంతో విలువైనదని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన 'బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం--2024' గురించి వివరించారు. అలాగే న్యాయ సేవల సహాయవాణి 15100, బాలల సహాయవాణి 1098 ద్వారా అవసరమైన సహాయం పొందవచ్చని, ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని అవగాహన కల్పించారు. బాలలకు ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే పోస్టర్లు ఆవిష్కరించిన

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 07: జిల్లాలో సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము" అనే లక్ష్యంతో రెండు వారాల పాటు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సర్వేకు పూర్తి సహకరించి, శరీరంపై స్పర్శ తెలియని అనుమానాస్పద మచ్చలు ఉంటే సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించు కోవాలని కోరారు. సర్వేలో ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ సభ్యులను పరీక్షిస్తారని తెలిపారు. అనుమానిత కేసులను గుర్తించి పీహెచ్‌సీ వైద్య బృందం ద్వారా మరోసారి పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) అందిస్తారని చెప్పారు. కుష్ఠు వ్యాధికి పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితం అని, తొలిదశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాధిక, డీపీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, డీఎన్ఎంఓ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎంపీహెచ్ఈఓ సుధాకర్ రాజు, డీఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కార్యాలయ సూపర్ ఆడిట్ 14 పిటిషన్లకు సత్వర పరిష్కారం చేయాలి

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 07: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, సీఎం కార్యాలయ సూపర్ ఆడిట్ టీం ద్వారా గుర్తించిన పిటిషన్లపై జిల్లా స్థాయిలో విచారణ చేపట్టి సత్వర పరిష్కారం మార్గాలు చూపుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. సోమవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సీఎం కార్యాలయ సూపర్ ఆడిట్ టీం ద్వారా జిల్లాకు పంపిన పిటిషన్లపై జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులు, అర్జీదారులతో స్వయంగా విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 14 పిటిషన్లను విచారించి పరిష్కార మార్గాన్ని చూపారు. సీఎం కార్యాలయ సూపర్ ఆడిట్ టీం ద్వారా పరిశీలన అనంతరం జిల్లాకు సంబంధించిన పిటిషన్లలో అధికారులు, సంబంధిత శాఖల స్థాయిలో ఏవైనా లోపాలు లేదా పొరపాట్లు చోటుచేసుకున్నాయా అనే అంశాలను పరిశీలించారు. ప్రతి పిటిషన్‌కు సంబంధించిన అధికారులను, అర్జీదారులను వ్యక్తిగతంగా పిలిపించి సమస్యను పూర్తిస్థాయిలో తెలుసుకున్నారు. అధికారుల స్థాయిలో ఏవైనా లోపాలు లేదా పొరపాట్లు గుర్తించిన సందర్భంలో వాటిని తక్షణమే సరిదిద్ది, అర్జీదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా నిబంధనల ప్రకారం అధికారులు తీసుకున్న నిర్ణయం సరైనదిగా ఉన్న సందర్భంలో, సంబంధిత చట్టాలు, నిబంధనలను అర్జీదారులకు స్పష్టంగా వివరించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో పరిశీలించి, నిబంధనల పరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. అర్జీదారులకు ప్రభుత్వ నిర్ణయాలు, నిబంధనలపై స్పష్టమైన సమాచారం అందించడం ద్వారా పారదర్శకతను పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కేఆర్ఆర్సి ఎస్డిసి మరియు జిల్లా పీజీఆర్ఎస్ నోడల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పిజిఆర్ఎస్ విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి నియోజకవర్గానికి దాదాపు రూ.2కోట్ల తాగునీటి పనులకు పరిపాలనా అనుమతులు

రాయచోటి, మహి న్యూస్, సెప్టెంబర్ 7: ఎల్ నినో ప్రభావం వల్ల రాయచోటి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో నీటి మట్టాలు పడిపోవడం వల్ల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తక్షణ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులపై ణవీళీ నిధులు లేదా అందుబాటులో ఉన్న ఇతర గ్రాంట్ల ద్వారా తాగునీటి అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు లేఖ రాసినట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రి లేఖపై తక్షణమే స్పందించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తాగునీటి సమస్య పరిష్కారం కోసం నీటి ఎద్దడి ప్రాంతాల్లో కొత్త బోర్లు తవ్వడం, మోటార్లు బిగించడానికి, ఇతరత్రా 90 పనులకు దాదాపు రూ.2 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి,

రామాపురం, రాయచోటి, సంబేపల్లి మండలాల్లో మొత్తం 90 తాగునీటి అభివృద్ధి పనులను రూ.2 కోట్ల అంచనా వ్యయంతో తక్షణం చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో...

1. చిన్నమండెం: 6 పనులు - రూ.11.60 లక్షలు
2. గాలివీడు: 20 పనులు - రూ.44.00 లక్షలు
3. లక్కిరెడ్డిపల్లి: 21 పనులు - రూ.44.60 లక్షలు
4. రామాపురం: 19 పనులు - రూ.47.30 లక్షలు
5. రాయచోటి: 7 పనులు - రూ.16.10 లక్షలు
6. సంబేపల్లి: 17 పనులు - రూ.36.30 లక్షలు

మొత్తం: 90 పనులు - రూ.199.90 లక్షలు

ఈ పనుల్లో కొత్త బోర్‌వెల్‌ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న తాగునీటి పథకాల సామర్థ్య పెంపు, నీటి వనరుల బలోపేతం, దెబ్బతిన్న పరికరాల మార్పిడి, పంపులు--పైప్‌లైన్ల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రత్యేకంగా రామాపురం మండలంలోని కొండవాండ్లపల్లి--చిట్లూరు జీపీ, వందాడి ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి సంబంధించిన పనులను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించడంతో రాయచోటి నియోజకవర్గం లోని గ్రామీణ ప్రజలకు ఉపశమనం కలగనుందని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలి

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 07 : పి జి ఆర్ ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ ఏ. వెంకటేష్, కెఆర్ఆర్సి ఎస్డిసి చంద్రశేఖర్ రెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..

1 పుంగనూరు మండలం భీమీగానిపల్లి పంచాయతీ పరిధిలోని రాంపల్లి గ్రామానికి చెందిన దేరంగుల చంద్ర పుంగనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడికాలు, కుడిచేయి విరిగిపోయి, ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యారు. దీంతో ఎలాంటి పని చేయలేక కుటుంబాన్ని పోషించేందుకు జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్నానని, తనకు ఇద్దరు సంతానం ఉన్నారని పేర్కొంటూ, ప్రభుత్వం వికలాంగ పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2.మదనపల్లె మండలం పంచాయతీ పరిధిలోని కొత్తవారిపల్లె చెందిన ఎం. ప్రభావతి భర్త ప్రమాదంలో మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పోషణ కష్టంగా ఉందని, తనకు ఏ ఆధారము లేదని వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. 3.పుంగనూరుకు చెందిన ఆర్. పుష్పలత తన భర్తకు డయాలసిస్ చికిత్స జరుగుతోందని, గత నెల వరకు డయాలసిస్ కోసం నెలకు రూ.10,000 పింఛన్ అందేదని తెలిపారు. సెప్టెంబర్ నెలలో పింఛన్ రాకపోవడంతో అధికారులను సంప్రదించగా, ఇంటి స్థలం 1,000 చదరపు అడుగుల కంటే ఎక్కువగా ఉన్నందున పింఛన్ నిలిపివేసినట్లు తెలిపారని పేర్కొన్నారు. అయితే తమ ఇంటి స్థలం 540 చదరపు అడుగుల కంటే తక్కువేనని తెలిపారు. ఈ విషయాన్ని తమరు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 336 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల రక్షణపై అవగాహన పెంచుకోవాలి

పోక్సో చట్టం, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థపై న్యాయ విజ్ఞాన సదస్సు

కడప జిల్లా/కడప, సెప్టెంబర్ 7 (మహి న్యూస్): కడప నగరంలోని అన్నమాచార్య సర్కిల్ సమీపంలోని మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'పిల్లల రక్షణ అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్, కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనలతో న్యాయ సహాయ రక్షణ న్యాయవాదుల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయ సహాయ రక్షణ న్యాయవాది ఎన్. హరిబాబు మాట్లాడుతూ చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టం--2012 ద్వారా బాలబాలికలను శారీరక, మానసిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని వివరించారు. చిన్నారులపై నేరాలు జరిగినప్పుడు భయపడకుండా ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచడం చట్టబద్ధమైన బాధ్యత అని తెలిపారు. చట్టంతో విభేదించే పిల్లలను నేరస్తులుగా కాకుండా సంస్కరణ దృక్పథంతో చూడాలని, ఆపదలో ఉన్న చిన్నారులకు ఆశ్రయం, పునరావాసం కల్పించడంలో బాలల సంక్షేమ సమితి, న్యాయ సేవాధికార సంస్థల పాత్రను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలకు సహకరించే వారిపైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. పిల్లలను ప్రమాదకర పనుల్లో నియమించడం నిషేధమని స్పష్టం చేశారు. అర్థిక స్థోమత లేని బాధితులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, అవసరమైన సందర్భాల్లో బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహాయం కోసం న్యాయ సేవల సహాయవాణి 15100, బాలల సహాయవాణి 1098, అత్యవసర పోలీసు సహాయం 112 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారులపై హింస, అన్యాయం జరిగినప్పుడు చూసీచూడనట్లు వ్యవహరించకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు చంద్రకాంతమ్మ, నీలకంఠేశ్వర రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లెకు హంద్రీ-నీవా జలాలు.. తాగునీటి ట్యాంకులకు తొలి ప్రాధాన్యం

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 07: మదనపల్లె పరిధిలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు. ట్యాంక్‌లో చేపడుతున్న పనుల పురోగతిని, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ, హంద్రీ--నీవా సుజల స్రవంతి కాలువల సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్యాంక్‌లో పేరుకుపోయిన వ్యర్థ మొక్కలు, పిచ్చి మొక్కలు తదితరాలను పూర్తిగా తొలగించి ట్యాంక్‌ను పరిశుభ్రంగా, నీటి నిల్వకు అనుకూలంగా సిద్ధం చేయాలని సూచించారు చిప్పిలి ట్యాంకులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు తాత్కాలికంగా ఎత్తు పెంచే చర్యలు చేపట్టి, గత ఏడాదితో పోలిస్తే అధికంగా నీటిని నిల్వ చేయాలని సూచించారు. నీరు వృథా కాకుండా షెడ్యూల్ ప్రకారం, క్రమబద్ధంగా ట్యాంకులను నింపుతూ ప్రతి మున్సిపాలిటీకి తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి చేరే హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తాగునీటి అవసరాల కోసం వినియోగించడమే ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీరు ట్యాంక్‌కు చేరే సమయానికి ఎటువంటి సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి నిల్వ, శుద్ధి మరియు మదనపల్లె పట్టణానికి తాగునీటి సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ ఇరిగేషన్ ఎస్ఈ. వెంకట్రామయ్య, హంద్రీనీవా సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వైరల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తిని కలిసిన సబ్ జైల్స్ అధికారి

ఖైదీల సంక్షేమం, న్యాయ సహాయంపై పరస్పర చర్చ

కడప జిల్లా/కడప, సెప్టెంబర్ 7 (మహి న్యూస్): కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి. రామ గోపాల్‌ను కడప జిల్లా సబ్ జైల్స్ అధికారి గురు శేఖర్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన జిల్లా న్యాయమూర్తికి పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జైలు పరిపాలన, ఖైదీల సంక్షేమం, న్యాయ సహాయం, న్యాయ సేవల కార్యక్రమాల అమలు తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, వారి హక్కులపై అవగాహన కల్పించడం, న్యాయ సేవల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రాయచోటి అభివృద్ధికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అహర్నిశలు కృషి

రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 7: రాయచోటి మండలంలోని చెన్నమొక్కపల్లి గ్రామపంచాయతీలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయచోటి రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రాయచోటి నియోజకవర్గంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. రాయచోటి ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిద్రలేని శ్రమ, చెదరని సంకల్పంతో అహర్నిశలు పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య, తాగునీరు, విద్య తదితర రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాయచోటి అభివృద్ధికి క్రిటికల్ కేర్ యూనిట్, జల జీవన్ మిషన్, ప్రతి ఊరికి గుడి--బడి వంటి కార్యక్రమాలు సజీవ సాక్ష్యాలని పేర్కొన్నారు. హంద్రీ--నీవా జలాలను వినియోగించుకుని ప్రతి పల్లె చెరువును నీటితో నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాయచోటి మున్సిపాలిటీని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా అన్న క్యాంటీన్ల ద్వారా ఉచిత భోజనం అందించడం, అవసరమైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ వంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇవన్నీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిరంతర ప్రజాసేవకు, అభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

"ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహము విజిట్ మరియు న్యాయవిజ్ఞాన సదస్సు

కడప మహి న్యూస్ సెప్టెంబర్ 7.: 07-09-2026 వ తేదీన గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప. జి .రామ గోపాల్ వారి సూచనల మేరకు గౌరవ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహమును, ప్రభుత్వ పరిశీలన గృహమును విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత మరియు భద్రత ఆరోగ్యం మరియు పరిశుభ్రత ఆహారం మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వంటశాలను వసతిగదులను టాయిలెట్లను పరిశీలించారు, విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయ సహాయము మొదలు అంశాలపై అవగాహన కలిగించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.యస్.ఎ సిబ్బంది, ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహము సూపర్ ఇండెంట్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ప్రతిభకు ప్రభుత్వ పురస్కారం

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 7: జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్స హించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ,2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,పండిట్ నెహ్రూ బస్టేషన్, విజయవాడ 520013 చిరునామాకు పంపవలసినదిగా పై ప్రకటనలో తెలిపారు.

టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ 1 కోటి 11 లక్షలు విరాళం

తిరుమల,సెప్టెంబర్ 7 మహి న్యూస్ : హైదారాబాద్ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడు ని కలిసి విరాళం అందజేసిన హైదరాబాద్ బంజారా హిల్స్ కు చెందిన కుంచాల మధురాం రెడ్డి టీటీడీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గోసంరక్షణకు భారీ విరాళం అందించి దాతృత్వం చాటుకున్న దాత మధురాం రెడ్డిని అభినందించిన చైర్మన్ బిఆర్ నాయుడు

రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు బయలుదేరిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

రేణిగుంట, మహి న్యూస్, సెప్టెంబర్ 07: నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయానికి తిరిగి చేరుకున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి నారాయణ, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, కూటమి నాయకులు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే పోస్టర్లు ఆవిష్కరించిన

– జాయింట్ కలెక్టర్ గోవిందరావు.

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 07: జిల్లాలో సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము" అనే లక్ష్యంతో రెండు వారాల పాటు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సర్వేకు పూర్తి సహకరించి, శరీరంపై స్పర్శ తెలియని అనుమానాస్పద మచ్చలు ఉంటే సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సర్వేలో ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ సభ్యులను పరీక్షిస్తారని తెలిపారు. అనుమానిత కేసులను గుర్తించి పీహెచ్‌సీ వైద్య బృందం ద్వారా మరోసారి పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) అందిస్తారని చెప్పారు. కుష్ఠ వ్యాధికి పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితం అని, తొలిదశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ శైలజ, డీఎన్ఎంఓ డాక్టర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ నిధులతో మూడు చెరువుల సమగ్ర అభివృద్ధి, సుందరీకరణ

Tank Name: Thukivakam Chinna Cheruvu

Estimation Cost: Rs.45,80,074/-
Expendituresofar:18,63,735/-

BeforeWork:

During Photos:

తిరుపతి, సెప్టెంబర్ 07 (మహి న్యూస్) :- తిరుపతి జిల్లాలో వాటర్‌షెడ్ నిధులతో మూడు సంప్రదాయ నీటి వనరులను సమగ్రంగా అభివృద్ధి చేసి, సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఐఏఎస్ తెలిపారు. తన చొరవతో డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్ వై 2.0లోని 'ప్లెక్సీ ఫండ్' ద్వారా జిల్లాలోని మూడు సంప్రదాయ నీటి వనరుల నవీకరణ పనులకు రాష్ట్ర స్థాయి మంజూరు కమిటీ (ఎస్ఎల్ ఎస్సీ) అనుమతి మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.1.30 కోట్లతో మూడు చెరువుల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

నందిగుంట చెరువు, తిరుపతి రూరల్ మండలం -- రూ.43.20 లక్షలు
చెన్నైగుంట చెరువు, తిరుపతి రూరల్ మండలం -- రూ.41.02 లక్షలు
తూకివాకం చిన్నచెరువు, రేణిగుంట మండలం -- రూ.45.80 లక్షలు

చెరువుల కట్టలను వెడల్పు చేసి వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేయడంతో పాటు రహదారికి ఇరువైపులా కెర్బ్ స్టోన్స్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు త్వరలో బెంచీలు, సౌర దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పిల్లల వినోదం, ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఆట పరికరాలతో కూడిన చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు."చెరువుల అభివృద్ధి పనులు అత్యంత వేగవంతంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే పనులను పూర్తి చేసి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలు ఈ వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఫిర్యాదు చేసినా అధికారుల మౌనం!

సగుటూరు, సెప్టెంబర్ 07। మహి న్యూస్ ప్రత్యేక కథనం

సగుటూరు చెరువు కట్ట కంపకర్ర విషయం పై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై స్థానికుల్లో చర్చ జరుగుతోంది. వీర్లగుణపాడు--సగుటూరు చెరువు కట్ట ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో ప్రజా ఆస్తికి సంబంధించిన కలప పక్కదారి పట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకున్నారో, విచారణ ప్రారంభించారో లేదో తెలియకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ఆస్తి, పంచాయతీ నిధులు మరియు అనుమతులు లేని కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలు కావడంతో అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఫిర్యాదు చేసినా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు?

విచారణ ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఆరోపణల్లో నిజమెంత?

ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

మహి న్యూస్ ప్రత్యేక కథనం – కొనసాగుతుంది...

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 07 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్ -- పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, సంబంధిత అర్డీవోలతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 264 వినతులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా 203 వినతులు రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచడానికి వీలు లేదన్నారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీల పరిష్కారంపై అయా శాఖల జిల్లా అధికారులు కిందిస్థాయిలో నుంచి మానిటర్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏలో 20 అర్జీలు ఉండగా, అయా శాఖల పరిధిలో పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులతో మానిటర్ చేస్తూ పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఐవిఆర్ఎస్ ఫీడ్బ్యాక్ కు సంబంధించి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యతిరేకతను తగ్గించాలని ఆదేశించారు.

శాఖల వారీగా వచ్చిన వినతులు:

రెవెన్యూ, సర్వే శాఖకు 203, పోలీస్ శాఖకు 6, పంచాయతీ రాజ్ శాఖ 3, డీఆర్డీఏ 27, ఇరిగేషన్ శాఖ 2, దేవదాయ శాఖ 2, సివిల్ సప్లై 2, పశుసంవర్ధక శాఖ 2, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ 3, పరిశ్రమల శాఖ 2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, వాటర్ రిసోర్సెస్ 2, గృహ నిర్మాణ సంస్థ 1, విద్యుత్ శాఖ 4, మత్స్యశాఖ 2, ఎలక్షన్ సెల్ 1, చొప్పున మొత్తం 264 వినతులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ కలెక్టర్ వై. సురేష్ , ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ యు. పుల్లారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకట సునీల్, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నత శాఖల తదితరులు అధికారులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి పథకం కింద వన్ స్టాప్ సెంటర్లలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 07: మిషన్ శక్తి పథకం కింద చిత్తూరు జిల్లా కుప్పం మరియు చిత్తూరు పట్టణాల్లో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్లలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎంపిక కమిటీ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులు పథకం అమలులో ఉన్నంతకాలం పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన కొనసాగుతాయని పేర్కొన్నారు. పోస్టుల వివరాలు, ఖాళీల సంఖ్య, వయోపరిమితి, వేతనం మరియు అర్హతలు ఈ విధంగా ఉన్నాయి.

1। పారా లీగల్ పర్సనల్ / లాయర్। 1 పోస్టు (వుమెన్- జెన్)। 25--42 సంవత్సరాలు। ?20,000/-

2। మానసిక-సామాజిక సలహాదారు (1 పోస్టు) (మహిళలకు మాత్రమే) 25--42 సంవత్సరాలు। ?20,000/-

3 . కేస్ వర్కర్లు - 3(వుమెన్- జెన్) పోస్టులు -- కుప్పం ఓఎస్సీ 2, చిత్తూరు ఓఎస్సీ 1 , 25--42 సంవత్సరాలు। ?19,500/-

4। బహుళ ప్రయోజన సిబ్బంది / సహాయకులు(4 పోస్టులు) (మహిళలకు మాత్రమే) (ఎస్టీ-1, బీసీ-సీ -1ఉ బీసీ-డి-1) 25--42 సంవత్సరాలు। ?13,000/-

5. సెక్యూరిటీ గార్డ్ / నైట్ గార్డ్(3 పోస్టులు) (బీసీ- ఏ - 1ఉ బీసీం-బీ-1) 25--42 సంవత్సరాలు। ?15,000/-

అర్హత ప్రమాణాలు

1 . పారా లీగల్ పర్సనల్ / లాయర్:

న్యాయశాస్త్రంలో డిగ్రీ పొంది, న్యాయ శిక్షణ లేదా చట్టాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి. జిల్లా స్థాయిలో మహిళలకు సంబంధించిన ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ప్రాజెక్ట్/కార్యక్రమంలో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం ఉండాలి. లేదా ఏదైనా న్యాయస్థానంలో వ్యాజ్యాలకు సంబంధించి కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగిన ప్రాక్టీసింగ్ లాయర్ అయి ఉండాలి.

2 . మానసిక-సామాజిక సలహాదారు (మహిళలకు మాత్రమే):

ఆరోగ్య రంగంలో నేపథ్యం కలిగి, సైకాలజీ/సైకియాట్రీ/ న్యూరోసైన్సెస్‌లో ప్రొఫెషనల్ డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండాలి. ప్రాధాన్యంగా జిల్లా స్థాయిలో ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ఆరోగ్య ప్రాజెక్ట్/కార్యక్రమంలో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

3 . కేస్ వర్కర్ (మహిళలకు మాత్రమే):

లా / సోషల్ వర్క్ / సోషల్ సైన్సెస్ / సైకాలజీలో బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ప్రాజెక్ట్/కార్యక్రమంలో మహిళలకు సంబంధించిన రంగాల్లో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

4 . బహుళ ప్రయోజన సిబ్బంది / సహాయకులు (మహిళలకు మాత్రమే):

సంబంధిత రంగంలో పరిజ్ఞానం లేదా పని అనుభవం కలిగి ఉండాలి. అక్షరాస్యత తప్పనిసరి. హైస్కూల్ ఉత్తీర్ణత లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

5 . సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ పోస్టుకు జిల్లా/రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ లేదా ప్రతిష్టాత్మక సంస్థలో భద్రతా సిబ్బందిగా కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులు. పదవీ విరమణ చేసిన సైనిక/అర్ధసైనిక సిబ్బందికి ప్రాధాన్యత ఉంటుంది.

దరఖాస్తు విధానం:

అర్హతా ప్రమాణాలు, దరఖాస్తు ఫారం మరియు ఇతర పూర్తి వివరాల కోసం చిత్తూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

"చిత్తూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్ - chittoor.ap.gov.in" (https://reference-url-citation.invalid/0)ఆసక్తిగల అభ్యర్థులు 07.09.2026 ఉదయం 10.00 గంటల నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిగా నింపిన దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, అనుభవ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం తదితర ధ్రువపత్రాల ఫోటోకాపీలను 17.09.2026 సాయంత్రం 5.00 గంటలలోపు చిత్తూరు కలెక్టరేట్, అంబేద్కర్ భవన్, 2వ అంతస్తులోని మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి (ఇఇడిజిజిడిజుూ) కార్యాలయంలో సమర్పించాలి. ప్రతి పోస్టుకు ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించబడుతుంది. అర్హత కలిగిన అభ్యర్థులను జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే మౌఖిక ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఎంపికలో మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 17.09.2026 సాయంత్రం 5.00 గంటల తర్వాత అందిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోరు. అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపు వర్తిస్తుంది. ఎటువంటి కారణం చూపకుండా ఈ నోటిఫికేషన్‌ను ఎప్పుడైనా రద్దు చేసే హక్కు చిత్తూరు జిల్లా కలెక్టర్/జిల్లా ఎంపిక కమిటీ చైర్మన్‌కు ఉంటుందని ప్రకటనలో స్పష్టం చేశారు.

వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 7: వినాయక చవితి ఉత్సవాలు మరియు వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ అట్లూరి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, వినాయక మండపాల ఏర్పాటుకు ప్రతిసారి ప్రతి శాఖ నుంచి విడివిడిగా అనుమతులు తీసుకునే అవసరం లేకుండా ప్రభుత్వం సింగిల్ విండో ఆన్‌లైన్ పర్మిషన్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వినాయక మండపాల వద్ద పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, పారిశుద్ధ్యం, మున్సిపల్ తదితర లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మండపాల వద్ద భారీ కేడ్లు ఏర్పాటు చేసి రహదారులను పూర్తిగా మూసివేయకుండా చూడాలని, ద్విచక్ర వాహనదారులు, ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆర్డీవో సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ, వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు, కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ప్రతి వినాయక మండపం వద్ద భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులను బాధ్యతగా నియమించుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు మండపాల వద్ద భద్రతా చర్యలను పరిశీలించి, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద మహిళలు, చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే డీజేలు, అధిక శబ్దంతో కూడిన కార్యక్రమాలకు దూరంగా ఉండి, ఉత్సవాలను భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని కోరారు. నిమజ్జన సమయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెద్ద పరిమాణంలో విగ్రహాలను ఏర్పాటు చేయకుండా, మట్టి మరియు పర్యావరణహిత వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను సెప్టెంబర్ 13వ తేదీలోగా సమర్పించాలని, వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 24వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం నీటి సమస్యలు ఉన్నందున నీటి వనరులకు ఇబ్బందులు కలగకుండా, పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 275 అర్జీలు

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 07: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను జిల్లా కలెక్టర్ సావధానంగా వింటూ అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటు, త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని, అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివ శంకర్ నాయక్, భరత్ నాయక్, రామాంజనమ్మ, సంబంధిత శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సిబ్బంది రసీదులను అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు:

రెవెన్యూ -- 152, సెర్ప్ 01, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 05, హోమ్ -19, పంచాయతీరాజ్ -31, కాలుష్య నియంత్రణ మండలి -- 1, బి సి వెల్ఫేర్ -1, ఎస్ ఎస్ ఎల్ ఆర్ -8, గనులు శాఖ -- 3, రూరల్ డెవలప్మెంట్ -1, తుడా -2, ఏ పి ఎస్ పి డి సి ఎల్ -3, హౌసింగ్ -- 1, రుయా -2, ఎస్ జి ఎస్ డబ్ల్యూ -5, వికలాంగుల సంక్షేమ శాఖ -1, పాఠశాల విద్య -8, కుటుంబ సంక్షేమం -5, ఎల్ డి ఎం -1, ఆర్ డబ్ల్యూ ఎస్ -1, దేవాదాయ శాఖ -1, ఎస్ సి కార్పొరేషన్ -2, టి టి డి -1, ఇరిగేషన్ -4, ఆర్ టి సి -1, సోషల్ వెల్ఫేర్ -2, ఉన్నత విద్య -1, చేనేత -1, రహదారి భవనాలు -1, కొ ఆపరేటివ్ -1, స్విమ్స్ -2, మత్స్య శాఖ -1, రిజిస్ట్రేషన్ స్టాంప్ లు -1, పశు సంవర్ధకం -2, పౌర సరఫరాలు -3, అటవీ శాఖ -1 వెరసి మొత్తం 275 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు వచ్చిన అర్జీల పై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com